క్లుప్తంగా

ఫ్యామిలీ ఫిజీషియన్ వినియోగించుకోవాలి


కొత్తపాలెంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ దినేష్ కోరారు. శుక్రవారం మండలంలోని శేరేపాలెం, కొత్తోట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కొత్తపాలెం ఆరోగ్య కేంద్రంలో సుమారు 60 మంది రోగులను పరీక్షించి మందులు అందచేశారు. అనంతరం అదే గ్రామంలో లేవలేని స్థితిలో ఉన్న రోగులను ఇంటికెళ్లి పరీక్షించి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో శ్యామల, నాగసుధ, తదితరులు పాల్గొన్నారు. కొత్తోట సచివాయంలో డాక్టర్ చంద్రశేఖర్ సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, పి.రామకృష్ణ, సత్యవతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రత్యేకంగా పర్యవేక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పుష్పరాజ్యం

నరసాపురం రూరల్: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంఈఓలు పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్‌లు అన్నారు. నరసాపురం మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, గోరుముద్ద, నాడు-నేడు, వంటి పథకాల అమలు తీరుపై, ఐఎఫ్‌టీ, స్మార్ట్ టీవీల వినియోగం తదితర వాటిపై పాఠశాలల వారీగా పర్యవేక్షించాలని సూచించారు. అలాగే బడిబయట పిల్లల్ని తిరిగి స్కూళ్లలో చేర్పించాలన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ


మార్టేరులో శాకంబరిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో పాలకొల్లురోడ్డులో ఉన్న శివరావుపేట కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం కూరగాయలతో అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారిని అనేక కూరగాయలతో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. పూజారి శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిర్ల రామకృష్ణ రెడ్డి, ప్రతికాయల రమణ ప్రతాప్, పిసిని రామసత్యనారాయణ, తాటిపూడి కుమారి, చిర్ల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఏటిగట్టు పనుల పూర్తి

చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: పొన్నపల్లి ఏటిగట్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కన్జర్వెన్సీ అధికారులను ఆదేశించారు. రూ.27 కోట్లతో చేపట్టిన పొన్నపల్లి ఏటిగట్టు పనులను శుక్రవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 30 శాతం పనులు పూర్తియ్యాయని, మిగిలిన పనులు ఆగస్టు నెలాఖరుకు నాటికి పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. వరదల సమయంలో రూ.56 లక్షలతో యుద్ధప్రాతిపదికన ఏటిగట్టు పనులను తాత్కాలికంగా చేపట్టామన్నారు. భవిష్యత్‌లో వరదలు వచ్చినా స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గట్టు పొడవునా రివిట్‌మెంట్, పనులు చేపట్టామన్నారు. ఏటిగట్టు కోతకు గురి కాకుండా మున్సిపాలిటీ పరిధిలో 450 మీటర్ల వరకు చేపట్టిన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. దర్భరేవు, మాధవాయిపాలెం, నవరసపురంలో ఉన్న తూములు, లోతట్టు ఉన్న ప్రాంతాల్లో ఏటిగట్టు పనులను రూ.8 కోట్లతో చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, పనులు త్వరలో ప్రారంభించబోతున్నారన్నారు.


నరసాపురంలో ఏటిగట్టు పనులను పరిశీలించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

శేషావతారం వియర్ ఛానల్‌కు సుమారు రూ.35 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, నాయకులు బర్రి శంకర్, వైకేఎస్, మల్లాడి బుజ్జి, కావలి నాని, కేసరి గంగరాజు, వల్లభుని శంకర్, రెడ్డిప్ప ధవేజి, కోటిపల్లి దొరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. శుక్రవారం నరసాపురంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని మంచినీటి చెరువులను ఎప్పటికప్పుడు నింపి స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. మొగల్తూరు మండంలోని చింతరేవు, గెదెళ్లవంపు, పేరుపాలెం నార్త్, మొగల్తూరు, నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు పంచాయతీ సైపువారి మెరకలో నూతనంగా నిర్మించిన ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంక్‌లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గతేడాది జలజీవన్ మిషన్ ద్వారా రూ.25 కోట్లతో చేపట్టిన మొదటి విడత పనులు 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్ రెండో విడతలో రూ.25 కోట్లతో 89 పనులకు టెండర్లు పిలిచామన్నారు. సమావేశంలో డీఈఈ యు.రవిరాజు, ఏఈలు టి.లోకేష్, డి.మోహన్‌రావులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై చర్చ అవసరం

నరసాపురం రూరల్: గ్రామస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టేందుకు వ్యవసాయ సలహా మండలి సమావేశాలు దోహదపడతాయని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి అన్నారు. నరసాపురం మండలంలోని ఎల్బీచర్ల రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నరసాపురం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాండ్రేగుల నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎల్బీచర్లలో ఇరిగేషన్ 20వ నెంబరు కాలువ మూసేసి అవసరమైన సమయంలో తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని, దర్భరేవు డ్రెయిన్ సమస్యను పరిష్కరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణ, వ్యవసాయశాఖ అధికారి జాన్సన్, ఏఈ మోహనకృష్ణ, జిల్లా ఎడ్వయిజరీ సలమామండలి మెంబరు సంగాని వడ్డికాసులు, వీఏఏ సాయిదుర్గ తదితరులు పాల్గొన్నారు.

మేలు చేయడానికే జగనన్న సురక్ష


పెనుగొండలో జగనన్న సురక్షను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టిందని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం పెనుగొండలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందనివారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాఖల మధ్య సమన్వయం ఉన్నప్పుడే ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా నీటి పారుదల శాఖాధికారి ఎస్‌వీరావు, తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాడవలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

బాడవలో ప్రతి ఇంటికీ తాగునీరు

యలమంచిలి: బాడవ గ్రామంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును త్వరలోనే ప్రారంభించి ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందిస్తామని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. బాడవ గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా జగనన్న పాలన సాగిస్తుంటే ఆయనకు వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేకే ప్రతి పక్షాలు అర్థం పర్థంలేని ఆరోపణలతో అనవసర విమర్శలు చేస్తున్నాయన్నారు. అవినీతి, సిఫారసులకు తావు లేకుండా అభివృద్ధి పథకాలను పెద్ద ఎత్తున అమలు చేస్తూనే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న మీ బిడ్డ జగనన్నను ప్రజలంతా ఆదరించాలని శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ నరసింహారావు, సర్పంచ్ రాయి వెంకట కనకదుర్గ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వినుకొండ మాణిక్యాలరావు (చిన్న), సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రావూరి రామకృష్ణ వైఎస్సార్ సీపీ నాయకులు గవర చంద్రరావు, గెల్లు గణపతి, ఇంటి గంగాధర్, చవ్వాకుల పెద్దిరాజు, దిగమర్తి అగస్టీన్, రాయి కృష్ణ, దేవరపు కృష్ణ, మేడిచర్ల నాగేశ్వరరావు మండల ప్రత్యేక అధికారి బి.వీరాస్వామి, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6.88 కోట్లతో రామేశ్వరం రహదారి నిర్మాణం

పెనుగొండ: వేల్పూరు-నత్తా రామేశ్వరం రహదారి నిర్మాణానికి రూ.6.88 కోట్లు మంజూరైనట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని వడలి మునమర్రు రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. కె.ఇల్లింద్రపర్రు, మల్లిపూడి, జుత్తిగ, నత్తారామేశ్వరం గ్రామాలకు సుమారు 11 కిలో మీటర్లు మేర నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. దీని వల్ల పెనుమంట్ర మండలం, పరిసర మండలానికి చెందిన సుమారు 21 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం సులభం అవుతుందన్నారు. దీంతో పాటు సిద్ధాంతం జుత్తిగ రహదారికి రూ.2.22 కోట్లు మంజూరయ్యాయని, ఎన్నో ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోకుండా ఉన్న పెనుగొండ వంతెన వద్ద నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు. అదేవిధంగా కవిటం గుమ్ములూరు రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నరసాపురం అశ్వారావుపేట రహదారి నిర్మాణికి రూ.25 కోట్లు మంజూరుయ్యాయని, దీని వల్ల మార్టేరు జగన్నాథపురం రహదారి సమస్యకు పరిష్కారం కలుగుతుందన్నారు. త్వరలోనే రోడ్డు నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. త్వరగా నిర్మాణాలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో మునమర్రు సర్పంచ్ తోట రత్నం, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అతి ప్రధానమైన రహదారి నత్తారామేశ్వరం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) కృతజ్ఞతలు తెలిపారు. దాదాపుగా 10 ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.


వడలిలో రహదారి మరమ్మతులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

మాజీమంత్రి సహకారంతో కమిటీల నిర్మాణం

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిలాల అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో జిల్లాలో నియోజకవర్గా నుంచి రాష్ట్ర స్థాయి కార్యవర్గం నియమించనున్నట్లు ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జి గుల్లా ఏడుకొండలు తెలిపారు. శుక్రవారం తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలసి జిల్లాలో నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు చేయాలని కోరారు.

రహదారి నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

పెనుగొండ: సిద్ధాంతం, దొంగరావిపాలెంలకు ఇంటి స్థలాలు అందించిన జగనన్న లే అవుట్‌కు రహదారి నిర్మాణానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగ నాథరాజు చొరవతో అడ్డంకులు తొలగాయి. ఈ మేరకు శుక్రవారం సిద్ధాంతం సొసైటీలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. ఇరుగ్రామాల ప్రజలకు అనువుగా ఉండేందుకుగాను 5.40 ఎకరాల సేకరించి సుమారు 200 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అయితే రహదారి నిర్మాణానికి రైతుల నుంచి సమస్యలు ఎదురయ్యాయి. దీంతో రహదారికి ఇరువైపులా ఉన్న 26 మంది రైతులతో చర్చించి వారికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందించే లోపు సొంతంగా ముందుగానే నగదు రైతులకు అందిస్తానని తెలిపారు. సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, ఏఎంసీ డైరెక్టర్ జుత్తిగ బాలయ్య, నడిపూడి ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను, జుత్తిగా దామోదర్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ద్వారా విస్తృత సేవలు


కృష్ణవేణిని సన్మానిస్తున్న నరసాపురం రోటరీక్లబ్ సభ్యులు

నరసాపురం రూరల్: రోటరీ క్లబ్ ద్వారా నరసాపురం పరిసర ప్రాంత ప్రజలకు విస్తృత సేవలందించే విధంగా నూతన కార్యవర్గం ప్రణాళిక రూపొందించుకోవాలని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ అన్నారు. స్థానిక వైఎన్ కళాశాలలో జరిగిన రోటరీ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాస బాబు మాట్లాడుతూ వ్యాపార సాంకేతిక నిపుణులను సంఘసేవలో భాగస్వాములను చేసి శాంతి సామరస్యాలను పెంపొందించడమే రోటరీ లక్ష్యమన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా గన్నాబత్తుల సత్యవతి, కార్యదర్శిగా వింజమూరి అనసూయ, ట్రెజరర్‌గా బొమ్మిడి సూర్యకుమారిలతో శ్రీనివాసబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో విశిష్ట వ్యక్తులైన షేక్ సిలార్‌సాహెబ్, గీతావాచస్పతి తాడిమేటి కృష్ణవేణి, కంచర్ల పద్మశ్యామల తదితరులను ఘనంగా సన్మానించారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కోట్ల రామ్‌కుమార్, ఘంటశాల బ్రహ్మాజీ, ప్రముఖ వ్యాఖ్యాత చక్రావధానుల రెడ్డప్ప ధవేజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకల నిర్వహణ

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గంలోని వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు పట్టణంలో ఉదయం 8గంటలకు గాంధీబొమ్మల సెంటర్‌లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

విలువలతో కూడిన విద్యాభ్యాసం అవసరం

యలమంచిలి: ప్రస్తుతం పిల్లలకు విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలని ఆనంద భైరవీ అంబా ఫౌండేషన్ చైర్మన్ వి అరుణకుమారి కోరారు. మేడపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆమె ఫౌండేషన్ తరపున నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లోని 43 పాఠశాలలకు రూ.50 వేలు విలువైన నోటు పుస్తకాలు అందజేస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వి సూర్యనారాయణమూర్తి, వి శ్రీతేజ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లేటికుర్తి శ్రీనివాసరావు సహోపాధ్యాయులు బొలిశెట్టి హనుమంతరావు, కప్పల కమలకుమారి పాల్గొన్నారు.

నేడు గవరపేట, దిగమర్రు గ్రామాల్లో జగనన్న సురక్ష

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేట, దిగమర్రు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాలు ఉదయం 9.30 గంటలకు గవరపేటలోనూ, అలాగే దిగమర్రులో 10.30 గంటలకు జరుగుతాయన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఏపీ హోటల్స్ అసోసియేషన్ జేసీగా కుమార్

పాలకొల్లు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పాలకొల్లు పట్టణానికి చెందిన డీఆర్‌యూసీసీ సభ్యులు జక్కంపూడి కుమార్, ఉపాధ్యక్షుడిగా కోరాడ గోవిదరాజులు ఎంపికయ్యారు. శుక్రవారం పట్టణ కాఫీ అండ్ బోజన హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దాసిరెడ్డి శ్రీనివాస్ రావు, కార్యదర్శి చినిమిల్లి గణపతిరావు, బైలా శ్రీదర్, ఆలపాటి హరిప్రసాద్, కేశవరాజు తదితరులు పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

డీఎన్నార్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ నెల 12 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. బీఏలో అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం, హిస్టరీ, బీకామ్‌లో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో మ్యాథ్‌మెటిక్స్, పిజిక్స్, కంప్యూటర్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజి కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి సమాచారం కోసం 63021 94657 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత సమస్యలు వస్తాయని హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక జీవీఎస్‌విఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ రక్తహీనత సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశవర్కర్లు జానకి, సునీత తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓ పర్యవేక్షణలో పంచాయతీ సమావేశం

పెనుగొండ: నరసాపురం డీఎల్‌పీఓ బలరామకృష్ణ పర్యవేక్షణలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అధ్యక్షతన పెనుగొండ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పంచాయతీ సమావేశాలు ఇబ్బందికరంగా మారుతుండడంతో శుక్రవారం డీఎల్‌పీవో పర్యవేక్షణలో నిర్వహించారు. గ్రామ కార్యదర్శి నరసింహమూర్తి సెలవుపై వెళ్లడంపై పలువురు వార్డు సభ్యులు ప్రశ్నించారు. అనంతరం ఎజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, ఈఓపీఆర్డీ జీఎస్‌వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.